జిల్లా కేంద్రం.. ట్రాఫిక్ అస్తవ్యస్తం

- రాయచోటిలో పని చేయని ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వాహనదారులు




బంగ్లా సర్కిల్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయకపోవడంతో అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనదారులు

రాయచోటి టౌన్ : జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా మారింది. సిగ్నల్స్ పని చేస్తున్నాయా.. లేదా అనే అయోమయంలో వాహనదారులు ఉన్నారు. రాయచోటిలో ఉన్న కూడళ్లలో బంగ్లా సర్కిల్ ప్రధానమైనది. చిత్తూరు, తిరుపతి, పీలేరు, మదనపల్లెల నుంచి బస్టాండ్‌కు వెళ్లే బస్సులతోపాటు రాయచోటి ప్రాంతాల నుంచి వివిధ మండలాలు, ప్రాంతాల నుంచి రాయచోటికి వస్తుంటారు. దీంతో అక్కడ ట్రాఫిక్ ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే ఠాణా సర్కిల్‌లోనూ అలాగే కనిపిస్తుంది. కడప రోడ్డు వైపు అయితే కడప, పులివెందుల, వేంపల్లె, లక్కిరెడ్డిపల్లెల నుంచే కాకుండా రాజంపేట, సుండుపల్లె వైపు నుంచి అనేక రకాల వాహనాలు రాయచోటికి వస్తుంటాయి. దీంతో ఠాణా సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఇంత ట్రాఫిక్ సమస్యగా ఉంటే బంగ్లా సర్కిల్ వద్ద చిత్తూరు రోడ్డు వైపు వెళ్లే సిగ్నల్స్ పూర్తిగా పని చేయడంలేదు. కానీ బంగ్లా వైపు నుంచి బస్టాండ్ వైపు వెళ్లే దారిలో మాత్రం కొన్ని లైట్లు పని చేస్తాయి. అలాగే ఠాణా వద్ద ఉన్న సిగ్నల్స్ బంగ్లా వైపు వెళ్లే దారిలో సిగ్నల్స్ పని చేసినా కడప వైపు వెళ్లే చోట సిగ్నల్స్ పని చేయకపోవడంతో వాహనదానులు తికమక పడుతున్నారు. దీంతో అయోమయంగా ముందుకెళ్లడం.. అక్కడకి వెళ్లిన తరువాత మళ్లీ కాస్త ఆగడం.. తరువాత ఎవరూ ముందు రాలేదని మళ్లీ ముందుకెళ్తున్నారు. ఈ అయోమయ పరిస్థితిలో సిగ్నల్స్ పడలేదని ఆగితే తరువాత ఎవరు ఎటువైపు నుంచి ఎటు వైపు మీదకు దూసుకొస్తారోననే భయం కనిపిస్తుంది. రాయచోటి పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఈ నాటిది కాదు ఎన్నో ఏళ్లుగా ఉంది. అలాంటిది గత ప్రభుత్వంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఒక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తోపాటు సిబ్బందిని అందుబాటులోకి తెచ్చారు. మొదట్లో ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై అధికారులు కొరడా ఝుళిపించడంతో జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ బెడద తీరింది. అయితే గత కొన్ని రోజులుగా పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. బంగ్లా సర్కిల్ వద్ద, ఠాణా వద్ద సిగ్నల్స్ పని చేయకపోవడంతో వాహనదారులు ఎవరికి ఇష్టమొచ్చినట్లుగా తమ వాహనాలపై దూసుకెళ్తుండటంతో మిగిలిన పాదచారులకు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించలేరేమో ..?



పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేరేయోనన్న అనుమానం కలుగుతోంది. రోడ్ల విస్తరణ పనులు జరుగుతుండటంతో వాహనదారులు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. అంతే కాక వాహనాల వాడకం ఎక్కువ అవ్వడంతోపాటు జిల్లా కేంద్రం కావడంతో ఇతరా ప్రాంతాల నుంచి వచ్చే వారి సంఖ్య ఎక్కువ అయ్యింది. దీంతో ట్రాఫిక్ సమస్య మరీ ఎక్కువ అవుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిగ్నల్స్ సరిగా పని చేయవు. ఎప్పుడుపడితే అప్పుడు ఆగిపోతాయి. దీంతో ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు దూసుకెళ్తుంటారు. దీనిని నియంత్రించకపోతే ప్రమాదాలు జరుగుతాయి. అధికారులు త్వరగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– మహబూబ్ బాషా, స్థానికుడు, రాయచోటి

చర్యలు చేపడతాం



బంగ్లా సర్కిల్ వద్ద సిగ్నల్స్ పని చేయడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య వచ్చిన విషయం నిజమే. దీనిపై తమ సిబ్బంది ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడానికి కృషి చేస్తున్నారు. సిగ్నల్స్ పని చేయడం లేదనే విషయం మున్సిపల్ కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. అప్పటి వరకు ట్రాఫిక్ ఇబ్బందిగా మారకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

– విశ్వనాథరెడ్డి, ట్రాఫిక్ సీఐ, రాయచోటి

క్లుప్తంగా

ఘనంగా చౌడేశ్వరమ్మ ఊరేగింపు



పురవీధులలో ఊరేగుతున్న చౌడేశ్వరమ్మ

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలోని తొగటపల్లెలో సోమవారం రాత్రి చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని రథంలో కొలువుదీర్చి గ్రామం పురవీధులలో ఊరేగించారు. అమ్మవారి వెంట జ్యోతులు వెలిగించి నృత్యాలు చేస్తూ తప్పెట్లు తాళాలతో బాణసంచా పేలుస్తూ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి నుంచి ఉదయం వరకు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని మెరవణి చేశారు. పోలీస్ పటిష్ట బందోబస్తు కల్పించారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

రాయచోటి టౌన్ : రాయచోటి డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలోని ప్రజలు నేడు కురిసే భారీ వర్షాల నుంచి జాగ్రత్తలు పాటించాలని రాయచోటి డివిజనల్ రెవెన్యూ అధికారి రంగాస్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండు రోజులుగా వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని అలాగే బుధవారం కూడా భారీ వర్ష సూచన ఉందని చెప్పారు. అలాగే అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉందని, రైతులు, పశువుల కాపర్లు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. ఎత్తైన చెట్లు, సెల్ టవర్ల దగ్గరకు వెళ్లరాదని సూచించారు. అత్యవసర సమయంలో 08561 293039కు ఫోన్ సంప్రదించాలని కోరారు.

పోలీసులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాంను అందిస్తున్న ఎస్ఐ, భాస్కర్‌లు

రామాపురం : మండల కేంద్రంలోని ఠాణాలో పని చేస్తున్న 25 మంది పోలీసు సిబ్బందికి యూనిఫాంలను బిట్స్ కళాశాల చైర్మన్ భాస్కర్ మంగళవారం సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట సుధాకర్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ పోలీసులకు యూనిఫాంలను వితరణ చేయడం సంతోషమని బిట్స్ కళాశాల చైర్మన్ భాస్కర్‌ను అభినందించారు.

కందిలో సస్యరక్షణ చర్యలతో దిగుబడులు

లక్కిరెడ్డిపల్లి : కందిలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని అగ్రికల్చర్ ఏడీ జయరాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బి.ఎ ద్రగుడి, కోనంపేట గ్రామాలలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతుండటంతో కంది పంట రైతుకు ఆశాజనకంగా మారుతుందని, ప్రతి ఒక్కరూ కందిలో కలుపుతీతతోపాటు చీడపీడల నివారణకు మందులు పిచికారీ చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమేష్ బాబు రావు, ఏఈఓలు కెరోలినా, అనూష, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరిలో పాము పొడ తెగులు



తెగులును గుర్తించి సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు

సిద్దవటం : వంతాటిపల్లె, ఎస్.రాజంపేట గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటకు పాముపొడ తెగులు సోకిందని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలం వంతాటిపల్లె, ఎస్.రాజంపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో పాముపొడ తెగులు నివారణకు వాలిడా మైసిన్(షీత్‌మార్) 2.0 మిల్లీ లీటర్లు మందును ఒక లీటరు నీటికి లేదా టిల్ట్ ఒక లీటరు నిటికి ఒక మిల్లీ లీటరు చొప్పు కలిపి పిచికారీ చేయాలని సూచించడం జరిగిందన్నారు. అంతే గాకుండా వంతాటిపల్లె రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ 2024 సీజన్‌కు సంబంధించి ఇ–పంట నమోదుపై సామాజిక తనిఖీ నిమిత్తం గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ప్రేమ్ కుమార్, శివకుమార్, టి.లక్ష్మీదేవి, సందీప్ సింహయాదవ్, శిరీష, మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, ఫోటో, వీడియోగ్రఫీలో 30 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సుల అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

మంత్రి మండిపల్లికి మహిళల వేడుకోలు



సంబేపల్లె: గ్రామ సమస్యలను మంత్రి మండిపల్లికి విన్నవిస్తున్న దేవపట్ల మహిళలు

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల, యర్రగుంట్ల, సంబేపల్లె గ్రామాలల్లో మంగళవారం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవపట్ల సమీపంలో సీసీ రోడ్డు పనులు, యర్రగుంట్ల బాలికల పాఠశాల సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణపు పనులకు ఆయన భూమిపూజ చేశారు. అదే విధంగా అంబేడ్కర్ నగర్ కాలనీలో తాగునీటి బోరు పాయింట్‌కు పూజ నిర్వహించారు. మండల పరిధిలోని దేవపట్ల హరిజనవాడ, వడ్డిపల్లెలలో తాగునీటి సమస్యలతో పాటు పలు సమస్యలు ఉన్నాయని మహిళలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

చిన్నమండెం : నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వండాడి, గొర్లముదివీడు క్రాస్ తూర్పుపల్లి రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజను మంత్రి చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పద్ధతులతో ఫలితాలు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ మురళీధర్

గాలివీడు : వ్యవసాయ సాగులో ఉత్తమ పద్ధతులను అనుసరించి తక్కువ పెట్టుబడి సాయంతో అధిక దిగుబడులను సాధించి అత్యుత్తమ ఫలితాలు పొందవచ్చని వ్యవసాయ అధికారి మురళీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పూలుకుంట, సీసీ పల్లెల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖరీఫ్, రబీ సాగుల్లో నాలుగు నెలల వంతున పొలం పిలుస్తోంది నిర్వహించేలా ప్రణాళిక రూపొందించ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తూ అవగాహన కల్పించారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పుల్లంపేట : మండల పరిధిలోని రంగంపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆర్.గొల్లపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, ఎంపీడీఓ పి.జయశ్రీ, ఏపీఓ శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని జీవిపురం, ఓబులవారిపల్లి పంచాయతీలలో మంగళవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఎంపీడీఓ మల్‌రెడ్డిలు సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మల్ రెడ్డి మాట్లాడుతూ గాదెల – వెంకటాపురానికి రూ. 22 లక్షలు, ఓబులవారిపల్లెకు రూ. 16 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణనికి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ కాగితపు సుజాత, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్, టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భారతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

నందలూరు : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తున్న వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ సుజాతమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇంకా జీతాలు కానీ, ఉద్యోగ భద్రత కానీ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ సుజాత మాట్లాడుతూ వినతి పత్రాన్ని పై అధికారులకు పంపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు సాయి కృష్ణ, సుబ్రమణ్యం రెడ్డి, కమాల్, సుధీర్, సునీల్, సుధా, అబ్దుల్ రెహమాన్, మహిళా వలంటీర్లు సుధారాణి, పావనీ, ఉమామహేశ్వరి, మాణిక్యమ్మ, జ్యోతి, సుజిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమ, ధ్వజ, శిఖర ప్రతిష్ట



పూజలందుకుంటున్న ఆంజనేయుడి ఉత్సవమూర్తి

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట పునఃనిర్మాణం జరిగిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం వేకువజామున హనుమ, ధ్వజ, యంత్ర శిఖర ప్రతిష్ట జరుగుతుందని నిర్వాహకులు గడికోట రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా హోమాలు, జపాలు, పవిత్ర సుగంధద్రవ్యాలు కలిపిన జలాలతో విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం శ్రీ ఆంజనేయస్వామి గ్రామోత్సవం, రాత్రి ధాన్యాధి, శయ్యధి, పుష్పాది బాసాల వేద పండితులు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి ప్రముఖ కాంట్రాక్టర్ పారిశ్రామికవేత్త శేఖర్‌రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా పంచలోహ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని వితరణ చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు దాత తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఏపీజే అబ్దుల్ కలాం



సుండుపల్లె: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల నేతలు


రాజంపేట టౌన్ : రచయితగా, మిసైల్ మ్యాన్‌గా, శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించిన ఏపీజే అబ్దుల్ కలాం బహుముఖ ప్రజ్ఞాశాలి అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం అబ్దుల్‌కలాం జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం గొప్ప మానవతామూర్తి అని కొనియాడారు. దేశానికి అబ్దుల్‌కలాం చేసిన సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. తొలుత ఆయన చిత్రపటానికి వారు నాయకులతో కలసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు షబ్బీర్ అహమ్మద్, పిండిబోయిన కృష్ణయాదవ్, సమ్మెట నరేంద్రరాజు, అబ్బిగారి గోపాల్, తోట రామయ్య, హరిరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని మంగళవారం ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం జీవితాన్ని ఆయన లక్ష్యాలను ఆదర్శంగా తీసుకొని ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో..

సుండుపల్లె : మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద భారతదేశ మిసైల్ మ్యాన్, 11వ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ప్రజా సంఘం, రాజకీయ, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజలు అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మహనీయుడు అబ్దుల్ కలాం అని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఈ సందర్భంగా వారు కోరారు.



రాజంపేట టౌన్: బీజేపీ కార్యాలయంలో..



రైల్వేకోడూరు అర్బన్: నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నేడు జెండా మెరవణి

రామాపురం : మండల నీలకంఠ్రావుపేట దర్గా పరిధిలో వెలసి ఉన్న హజరత్ సయ్యద్ మహబూబ్ సుబహానీ సాహెబ్ దస్తగిరి స్వామి జెండా మహోత్సవం బుధవారం సాయంత్రం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. నీలకంఠ్రావుపేట దర్గా స్వామి భక్తులందరికీ సాయంకాలం 5గంటలకు దర్గా పరిధిలో పక్కీరుల విన్యాసాలతో జెండా మెరవణి వైభవంగా జరుగుతుందన్నారు. భక్తులకు ఫాతేహా తరువాత తీర్థ, అన్న ప్రసాదములు పంపిణీ జరుగుతుందని చెప్పారు.

ముందస్తు చర్యల్లో అధికార యంత్రాంగం



గుంజనేరు పరివాహక ప్రాంతాలలో పర్యటిస్తున్న తహసీల్దార్, అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని వరద ప్రాంతాలలో తహసీల్దార్ మహబూబ్ చాంద్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాల సహాయంతో అన్ని ప్రాంతాలు పర్యవేక్షించారు. శెట్టిగుంట చెరువు, గుంజనేరు పరివాహక ప్రాంతం, నరసరాపేట, గాండ్ల వీధి, ధర్మాపురం తదితర ప్రాంతాలలో ఆమె పర్యటించి చర్యలు చేపట్టారు. రానున్న మూడు రోజులు కురవనున్న వర్షాలలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఓటరు జాబితాపై దృష్టి పెట్టండి

పెనగలూరు : మండలంలో త్వరలో జరగనున్న ఇరిగేషన్ ఎన్నికల ఓటర్ల జాబితాపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ ఇంద్రాణి తెలిపారు. మంగళవారం ఇరిగేషన్ శాఖ ఏఈ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెనగలూరు, కొండూరు ఈస్ట్, కొండూరు వెస్ట్, వెలగచర్ల, సింగనమల, గోవిందంపల్లి, ఓబిలి చెరువులకు సంబంధించిన ఓటర్ల జాబితా, అలాగే సిద్దవరం, సింగారెడ్డిపల్లి, పొందలూరు, ఓబిలి, నారాయణ నెల్లూరు, ఇండ్లూరు, తిరుమలరాజుపేటలకు చెందిన ఊటకాలువల ఎన్నికల ఓటర్ల జాబితాను పూర్తి చేయాలన్నారు. పాత ఓటర్ల జాబితా ప్రకారం వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్నాయని, కావున ఓటర్ల జాబితాలో ఎవరైనా మృతి చెందిన వారు ఉంటే వారిపేరు తొలగించేందుకు విచారణ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. వీలైనంత త్వరగా ఓటర్ల జాబితాను పూర్తి చేసి తుది జాబితా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ దయానంద, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



సబ్‌కలెక్టర్ నైదియా దేవికి పరిస్థితిని వివరిస్తున్న మున్సిపల్ కమిషనరు బిల్లా నాగేశ్వరరావు

రాజంపేట : నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పట్టణంలోని పలు ప్రాంతాలను మంగళవారం రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి పరిశీలించారు. అల్పపీడనం ప్రభావంతో నాలుగు రోజులపాటు వర్షాలు ఉంటాయని హెచ్చరించిన నేపథ్యంలో ఆమె మున్సిపల్ అధికారులును అప్రమత్తం చేశారు. నుద్దగుంతలతోపాటు వర్షం తాకిడితో జలమయంగా మారిన ప్రదేశాలను సందర్శించి, వెనువెంటనే యుద్ధప్రాతిపదకన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపునీటి వల్ల రాకపోకలు కానీ, ఇతరత్రా సమస్యలు రాకుండా చూడాలని సబ్‌కలెక్టర్ తెలిపారు. మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. సబ్ కలెక్టర్ సూచనలు పాటించే విధంగా కమిషనరు బిల్లా నాగేశ్వరరావు తమ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ హరి, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరించండి

వర్షాలు అధికంగా పడతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి అన్నారు. మంగళవారం రాత్రి సబ్ కలెక్టరేట్‌లోని తన చాంబరులో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వాతావరణశాఖ పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపిందన్నారు. రాజంపేట పట్టణంలో 11 ప్రదేశాలలో నీరు నిలిచాయని గుర్తించామన్నారు. రైల్వేకోడూరులో 119 మి.లీ. వర్షపాతం నమోదైందన్నారు. శెట్టిగుంటలో కొంతమేర పంట నష్టం జరిగిందన్నారు. పాఠశాలల యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా విపత్తు సంభవిస్తే వెంటనే కంట్రోల్ రూం 08565 240079ను సంప్రదించాలన్నారు. రాజంపేట డివిజన్‌లో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

చినుకు పడితే రోడ్లు చిత్తడే



పుల్లంపేట: గుంతలమయమైన దళవాయిపల్లె - కేతురాజుపల్లెకు వెళ్లే మార్గం



రైల్వేకోడూరు అర్బన్: అంకాలమ్మనగర్‌లో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు



ఒంటెల సిద్దయ్య వీధిలో వర్షపునీరు వద్ద నిరసన

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మేజర్ పంచాయతీలో గత రెండు రోజులుగా కురిసిన వర్షానికే రోడ్లు జలమయమై ఇళ్లలోకి నీరు చేరుతోంది. అలాగే పలు ప్రాంతాల్లో రోడ్లపైనే నీరు నిలిచి చిత్తడిగా మారుతోంది. మంగళవారం అంకమ్మ నగర్‌లో ఇండ్లలోకి నీరు వచ్చింది. విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మందల నాగేంద్ర, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్‌లు పరిశీలించి సర్పంచ్, ఈఓలతో మాట్లాడి మోటర్‌లతో నీరుతీయించారు. కాలనీలో సీసీరోడ్డు వేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే రాంనగర్, ఒంటెల సిద్దయ్య వీధులలో సీపీఎం నాయకులు పండుగోలు మణి వర్షపు నీరు నిలిచి ఉండడంతో సీసీ రోడ్డులు వేయాలని లేకుంటే పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండలంలోని పలు గ్రామాలలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. బాటచారులు, వాహనదారులు రోడ్లు గుంతలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని దళవాయిపల్లి నుంచి కేతరాజుపల్లికి వెళ్లే మార్గంలో నీరు నిలవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాహనదారులు రహదారిపై వాహనాలలో వెళ్లాలంటే ఎక్కడ ప్రమాదం సంభవిస్తుందోనని భయభ్రాంతాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఉద్యాన రైతులు అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం : అధిక వర్షాల నేపథ్యంలో ఉద్యాన రైతులు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలను తీసుకోవాలని ఉద్యానాధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దపల్లి, బొగ్గిడివారిపల్లె గ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయిలో అధికారులు ఉద్యాన పంటలైన అరటి, పసుపు, మామిడి, చామంతి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జయభరత్‌రెడ్డి మాట్లాడుతూ అధిక వర్షాలు కురిసినప్పుడు పంట పొలాల్లో నిలిచి ఉన్న మురుగు నీరును పొలాల్లోని గట్లను తెంచి బయటకు పంపించాలన్నారు. లేకపోతే వేరుకుళ్లు లేదా దుంప కుళ్లు సోకి మొక్క చనిపోయే అవకాశం ఉందన్నారు. వర్షాలు ఉన్నాయి కాబట్టి రైతులు ఎవరూ పంటలకు నీరు అందించడం 3, 4 రోజులు వాయిదా వేసుకోవాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత పసుపు పంటలో రిడోమిల్ మందు 3 గ్రాములు లీటరు నీటితో కలిపి వేరు తడిచేలా సాలల్లో పోయాలన్నారు.

అలాగే మిగిలిన ఉద్యాన పంటల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని, వేరు తడిచేలా పోయాలన్నారు. అలాగే పైపాటుగా 19:19:19 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే మొక్క ఎదుగుదల బాగుంటుందని ఆయన రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.